

అమరావతి కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అంబేడ్కర్



అమరావతిలో మంగళవారం జరిగిన మొదటిరోజు కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు రాష్ట్ర స్థాయిలో అంశాలపై సమీక్షించారు. విజయనగరం జిల్లా అంశాలపై సీఎంకు బుధవారం కలెక్టర్ వివరించనున్నారు.

- విజయనగరం కలెక్టరేట్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి)

ఉగాదికి ముందే తలుపుతట్టిన అదృష్టం



ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతల కూపన్లను ప్రదర్శిస్తున్న అడిషనల్ ఎస్పీ వెంకటరమణ, డీఎస్పీ వివేకానంద, ఎస్ఐ సందీప్‌కుమార్, చిత్రంలో 'ఆంధ్రజ్యోతి' బ్రాంచ్ మేనేజర్ సోమశంకరరావు తదితరులు



ప్రథమ బహుమతి విజేత బల్లా రామకృష్ణకు ఫోన్ చేసి చెబుతున్న డీఎస్పీ వివేకానంద

- ఉత్సాహంగా కార్ అండ్ బైక్ రేస్ లక్కీడ్రా
- ప్రథమ బహుమతి విజేత బల్లా రామకృష్ణ
- 100 మందికి కన్సొలేషన్ బహుమతులు
- ఇలాంటి కార్యక్రమాలతో 'ఆంధ్రజ్యోతి'కి ఆదరణ: అడిషనల్ ఎస్పీ వెంకటరమణ
- పాఠకులకు మరింత ప్రోత్సాహం: డీఎస్పీ వివేకానంద

ఎచ్చెర్ల, మార్చి 25(ఆంధ్రజ్యోతి):

ఉగాదికి ముందే 'ఆంధ్రజ్యోతి' పాఠకులకు అదృష్టం తలుపుతట్టింది. ఎన్నో విలువైన కానుకలు గెలుచుకున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన పాఠకుల ఇంట సందడి కనిపించింది. 'ఆంధ్రజ్యోతి' 22వ వార్షికోత్సవం సందర్భంగా ఎచ్చెర్లలోని యూనిట్ కార్యాలయంలో మంగళవారం కార్ అండ్ బైక్ రేస్ లక్కీ డ్రా కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. శ్రీకాకుళం అడిషనల్ ఎస్పీ కె.వెంకటరమణ, శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్.వివేకానంద, ఎచ్చెర్ల ఎస్ఐ వి.సందీప్‌కుమార్‌లు లక్కీ డ్రా తీసి విజేతలను ప్రకటించారు. ప్రథమ బహుమతి విజేతైన బల్లా రామకృష్ణకు డీఎస్పీ స్వయంగా (మిగతా 8వ పేజీలో..)

విజేతల వివరాలు..

- ప్రథమ బహుమతి: బల్లా రామకృష్ణ, డోర్ నెంబరు 9-15-13, బోయి వీధి, వైఎస్ఆర్ స్ట్రీట్, విజయనగరం
- ద్వితీయ బహుమతి: లంక కుమారి, డోర్ నెంబరు 43-63/ఎ, జూబ్లీరోడ్, బొబ్బిలి, విజయనగరం జిల్లా
- తృతీయ బహుమతి: పేడాడ లలితకుమారి, డోర్ నెంబరు 10-102, పెదవీధి, చీమలవలస, ఆమదాలవలస మండలం, శ్రీకాకుళం జిల్లా.

ఏపీపీఎస్సీ పరీక్షకు 625 మంది దూరం

విజయనగరం కలెక్టరేట్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాలో జరిగిన పరీక్షకు 625 మంది అభ్యర్థులు దూరంగా ఉన్నారు. మూడు కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షకు ఉదయం సమయంలో 840 మంది హాజరుకావాల్సి ఉండగా 442 మంది హాజరయ్యారు. 398 మంది దూరంగా ఉన్నారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షను 405 మంది రాయాల్సి ఉండగా 178 మంది రాశారు. 227 మంది దూరంగా ఉన్నారు.



పరీక్ష కోసం కేటాయించిన గదిని తెలుసుకుంటున్న అభ్యర్థులు

విద్యాలయ భూములనూ వదలరా?



ఎస్.కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో పెరిగిన టేకు చెట్లు

- ఎస్.కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూములపై కన్ను..!
- మాన్సాస్ నుంచి కొనుగోలు చేసిన ప్రభుత్వం
- సరైన రికార్డులు లేకపోవడంతో ఆక్రమణలకు యత్నం
- చెట్లు మావంటూ తాజాగా కొందరి బుకాయింపు
- అధికారుల ప్రవేశంతో వెనకడుగు
- ఇంకా ఆక్రమణలో కళాశాల, మాన్సాస్ భూములు

రెండు నెలల క్రితం ఎస్.కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అనుబంధంగా మహిళా వసతి గృహ నిర్మాణానికి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. కేంద్ర ప్రభుత్వం రూ.6 కోట్లు కేటాయించింది. కళాశాలకు చెందిన స్థలంలో నిర్మాణం చేపట్టేందుకు తొలుత చెట్ల తొలగింపునకు ప్రయత్నించగా కొంతమంది వచ్చి ఈ భూమి తమదంటూ పేచీకి దిగారు. దీంతో కళాశాల సిబ్బంది రెవెన్యూ అధికారులను సంప్రదించారు. తహసీల్దార్ ఎం.అరుణకుమారి సర్వే చేయించారు. సర్వే నెంబర్‌ల ప్రకారం కళాశాల భూమిగా గుర్తించారు. అయితే ఈ కళాశాల మాన్సాస్ సంస్థ నుంచి గతంలో తీసుకున్న భూమిలో చాలా వరకు ఆక్రమణలు ఉన్నట్లు అనుమానాలున్నాయి.

శృంగవరపుకోట, మార్చి 25(ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట పంచాయతీ పరిధిలోని పుణ్యగిరి కొండ సమీపంలో మాన్సాస్(మహారాజ అలక్ నారాయణ సొసైటీ ఆర్ట్స్ అండ్ సైన్స్)కు 20 ఎకరాల వరకు భూములున్నాయి. ఇందులో ఎకరా రూ.2వేలు చొప్పున 15 ఎకరాలను 1984లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణం కోసం ప్రభుత్వ సంస్థ యూజీసీ (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్) కొనుగోలు చేసింది. సర్వే నెంబర్ 157లో పది ఎకరాలు, సర్వే నెంబర్ 149లో ఐదు ఎకరాలను యూజీసీకి మాన్సాస్ అప్పగించింది. మూడు దశాబ్దాల క్రితం ఇక్కడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నిర్మించారు. అందులో బీఏ, బీకాం, బీఎస్సీ మ్యాథ్స్, కెమిస్ట్రీ తరగతులు నిర్వహిస్తున్నారు. పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉండడం, రవాణా (మిగతా 8వ పేజీలో..)

వసతి గృహానికి రూ.6 కోట్లు మంజూరు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అనుబంధ మహిళా వసతి గృహం మంజూరైంది. రూ.6కోట్లతో కళాశాలకు అనుకుని ఉన్న స్థలంలో నిర్మించేందుకు నిర్ణయించాం. ఇందులో టేకు చెట్లు ఉన్నాయి. వీటిని తొలగించేందుకు రెవెన్యూ, అటవీ శాఖాధికారులకు విన్నవించాం. అనుమతులు వచ్చాయి. తహసీల్దార్ అరుణకుమారి ప్రతిపాదిత స్థలానికి హద్దులు నిర్ణయించి ఇచ్చారు.

- కేశవరావు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎస్.కోట

హద్దులు చూపించాం

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన భూములకు హద్దులు చూపించాం. పక్కాగా హద్దులు నిర్ణయించేందుకు మాన్సాస్ సంస్థ భూ రికార్డులను ఇవ్వాల్సి ఉంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాల యాజమాన్యం వద్ద వున్న రికార్డులో స్థలం కొనుగోలు చేసినట్లు మాత్రమే ఉంది. ఆ భూమికి సంబంధించిన మ్యాప్ లేదు. ఎవరైన అడ్డగిస్తే సమాచారం ఇవ్వాలని చెప్పాం.

- ఎం.అరుణకుమారి, తహసీల్దార్, శృంగవరపుకోట

త్వరపడండి

నెలాఖరులోగా ఈకేవైసీ కావాలి

ఇప్పటికి 92 శాతం పూర్తి



గరివిడి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డు లబ్ధిదారులంతా నెలాఖరులోపు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ రాష్ట్ర కమిషనర్ సౌరబ్‌ఘౌర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆయా కుటుంబాలన్నీ ఈకేవైసీ పూర్తి చేయించుకునే పనిలో నిమగ్నమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఇంకా 8 శాతం నమోదు కావాల్సి ఉంది. కాగా గ్రామాల్లో రేషన్ డిపో డీలర్లు తమ పరిధిలో ఉన్న కార్డుదారుల్లో ఇంకా ఎవరెవరికి ఈకేవైసీ లేదో గుర్తించి వారిళ్లకు వెళ్లి ఈకేవైసీ నమోదుపై అవగాహన కల్పిస్తున్నారు. గ్రామ వార్డు సచివాలయాల మొబైల్ యాప్ ద్వారా గాని, రేషన్ షాపులో ఉన్న ఈ-పాస్ పరికరాల ద్వారా కాని ఈకేవైసీ అప్‌డేట్ చేస్తున్నారు. ఐదు సంవత్సరాలలోపు వారు మినహా మిగతా కార్డు సభ్యులంతా ఈకేవైసీ నమోదు చేసుకోవాలి. దీనిపై రెవెన్యూ అధికారులు ఇప్పటికే పలుమార్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాలో 1244 రేషన్ డిపోలు ఉండగా వీటి పరిధిలో 5 లక్షల 71 వేల, 240 రేషన్‌కార్డులు (తెలుపు, అంత్యోదయ కలిపి)ఉన్నాయి. ఇకపై ప్రభుత్వ పథకాలు అందాలన్నా ఈకేవైసీ నమోదు తప్పనిసరని చెప్పడంతో అందరూ పరుగులు తీస్తున్నారు.

● ఈకేవైసీ నమోదు అంశాన్ని జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి మధుసూదనరావు వద్ద సంప్రదించగా జిల్లాలో ఈకేవైసీ వేగవంతంగా సాగుతోందన్నారు. రెవెన్యూ సిబ్బంది, డీలర్లు అదే పనిలో ఉన్నారని, నెలాఖరుకు శతశాతం పూర్తిచేయడానికి ప్రయత్నాలు చేస్తున్నామన్నారు.

పేకాట శిబిరాలపై డ్రోన్స్‌తో నిఘా

● స్థావరాలపై దాడి ● అదుపులో తొమ్మిది మంది: ఎస్పీ వకుల్‌జిందాల్



లారీలో పేకాటాడుతున్న వారిని డ్రోన్‌తో గుర్తించిన దృశ్యం

విజయనగరం క్రైం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): హుకుంపేట శివార్లలో పేకాటాడుతున్న వారిపైనా, పూసపాటిరేగ మండలం వెంపడాం గ్రామ శివార్లలో కోడి పందేలు ఆడుతున్న వారిపైనా డ్రోన్స్ సహాయంతో పోలీసులు దాడి చేశారు. నిఘా పెట్టి రైడ్ చేసి పేకాట, కోడి పందేలు ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్పీ వకుల్‌జిందాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌బీ పోలీసులకు వచ్చిన సమాచారంతో రెండో పట్టణ సీఐ శ్రీనివాసరావు సిబ్బందితో హుకుంపేట శివార్లలో పార్కింగ్ చేసిన లారీలో పేకాటాడుతున్న వారిని గుర్తించారు. తొలుత డ్రోన్ పంపి స్థావరాన్ని గుర్తించారు. ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 12,600 నగదు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే పూసపాటిరేగ మండలం వెంపడాం గ్రామ శివార్లలో కోడిపందేలు నిర్వహిస్తున్నట్టు సమాచారం అందడంతో తొలుత డ్రోన్ పంపి భోగాపురం రూరల్ సీఐ జి.రామకృష్ణ, పూసపాటిరేగ ఎస్ఐ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 15,600 నగదు, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. నేర నియంత్రణలోనూ, శివారు ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాల ఆచూకీ తెలుసుకునేందుకు కూడా డ్రోన్స్ వినియోగిస్తున్నట్టు ఎస్పీ తెలిపారు.

మృత్యుతీరానికి మరో చిన్నారి

- రెండు నెలల కాలంలో గిరిశిఖర గ్రామంలో ఇద్దరి మృతి
- వైద్యశాఖ నిర్లక్ష్యమే కారణమన్న బాధిత కుటుంబ సభ్యులు



మృతశిశువుతో గ్రామానికి బయలుదేరిన తల్లి

శృంగవరపుకోట రూరల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): గిరిశిఖర పంచాయతీ దారపర్తిలో శిశుమరణాలు ఆగడం లేదు.. రెండునెలల క్రితం జనవరి 26న అనారోగ్యంతో రెండు నెలల శిశువు జన్ని విజయ్ మరణం మరువకముందే ఇదే గ్రామానికి చెందిన కురిడిబోయిన గంగులు, సీతమ్మల ఐదునెలల కుమారుడు(పేరు పెట్టలేదు) అనారోగ్యంతో మంగళవారం ఉదయం విజయనగరం ఘోషా ఆసుపత్రిలో ప్రాణాలొదిలాడు. ఎస్.కోట ప్రభుత్వ ఆసుపత్రికి సోమవారం తీసుకెళ్లారని, వారు నిర్లక్ష్యంతో సరైన వైద్యం చేయకుండా వదిలేశారని, పరిస్థితి విషమించాక విజయనగరం రిఫర్ చేశారని శిశువు కుటుంబ సభ్యులు ఆరోపించారు.

దారపర్తి గ్రామానికి చెందిన కురిడిబోయిన గంగులు, సీతమ్మల ఐదు నెలల కుమారుడు మూడు రోజుల కిందట అనారోగ్యం బారిన పడ్డాడు. ఊపిరి సరిగా అందక ఇబ్బంది పడుతుండడాన్ని గుర్తించిన తల్లిదండ్రులు ఆదివారం రాత్రి 11గంటల సమయంలో ఎస్.కోట సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ఆ సమయంలో బాలుడికి ప్రాథమిక చికిత్స అందించారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు బాలుడ్ని పర్యవేక్షిస్తూ వైద్యం అందించారు. అయినప్పటికీ సాయంత్రానికి యూరిన్ నిలిచిపోయింది. దీంతో అక్కడి వైద్యులు విజయనగరం రిఫర్ చేశారు. ఆ వెంటనే విజయనగరం ఘోష ఆస్పత్రికి తరలించారు. అక్కడ వెంటిలేటర్‌పై చికిత్స అందించినా ఊపిరితిత్తుల్లో సమస్య తగ్గలేదు. పరిస్థితి మరింత విషమించడంతో మంగళవారం ఉదయం బాలుడు మృతిచెందాడు.



మాయాజలం

- జిల్లాలో జోరుగా మంచినీటి వ్యాపారం
- నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు
- కొరవడిన పర్యవేక్షణ
- పుట్టగొడుగుల్లా వాటర్ ప్లాంట్లు

రాజాం రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి)

రోజురోజుకూ భానుడి భగభగలు పెరిగిపోతున్నాయి. ఎండవేడిమిని తాళలేక దాహం తీర్చుకోవాలి అనుకునే వారికి వ్యాపారులు వాతలు పెడుతున్నారు. రూ.రెండు విలువైన అమ్ముతున్న వాటర్ ప్యాకెట్ నుంచి రూ.40 వరకూ విక్రయిస్తున్న జ్యూస్‌ల వరకూ అన్నింటా అడ్డంగా దోచుకుంటున్నారు. దాహం తీర్చుకోబోతే.. చేతి చమురు వదలడంతో పాటు కొత్త జబ్బులు 'కొని' తెచ్చుకోవలసి వస్తోంది. ముఖ్యంగా వాటర్ ప్లాంట్ల నుంచి 'మినరల్' పేరుతో అమ్ముతున్న నీటిలో నాణ్యత లోపిస్తోంది.

● ఎక్కడికక్కడే..

జిల్లాలో నీటిప్లాంట్లు పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. వీటిలో ఒకటో, రెండో నాణ్యతకు ప్రాధాన్యమిస్తున్నాయి. అధిక శాతం ప్లాంట్లు నాణ్యతకు తిలోదకాలిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో నీటి తయారీదారులు నిబంధనలు పాటించడం లేదు. మార్కెట్లో పేరున్న సంస్థల లీటర్ వాటర్ బాటిల్ రూ.20కి అమ్ముడవుతుంటే నీటి ప్లాంట్లలో 20 లీటర్ల క్యాన్ రూ.20, కూలింగ్ వాటర్ క్యాన్ రూ.40కి లభ్యమవుతుండడంతో గృహస్తులతో పాటు వర్తక, వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక వర్గాలు సైతం కొనుగోలు చేస్తున్నారు. తాము తాగుతున్న నీరు మంచిదేనా.. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా తయారైందో లేదో తెలుసుకునే అవకాశం ఏ ఒక్కరికీ లేకపోవడంతో నీటి అమ్మకందారులు ఇచ్చిందే మంచినీరుగా భావించి తాగుతూ రోగాల బారిన పడుతున్నారు.



ఇలాంటి క్యాన్లలోని నీటినే జనం తాగుతున్నారు

● రూ.కోట్లలో వ్యాపారం..

జిల్లాలో నీటి వ్యాపారం రూ.కోట్లలో సాగుతోంది. సాధారణ రోజులతో పోలిస్తే వేసవి కాలంలో రెట్టింపు వ్యాపారం జరుగుతోంది. 20 లీటర్ల క్యాన్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి గతంలో ఎగువ మధ్యతరగతి వర్గీయులు మాత్రమే వాడే ఈ నీటిని ప్రస్తుతం దిగువ మధ్య తరగతి వర్గీయులతో పాటు సాధారణ ప్రజలూ వినియోగిస్తున్నారు. నెలకు జిల్లాలో సుమారు రూ.25 కోట్ల మేర నీటి వ్యాపారం సాగుతున్నట్టు అంచనా.

నిబంధనలివీ..

మంచినీటి ప్లాంటు ఏర్పాటు చేయాలంటే ముందుగా ఆహార కల్తీ నిరోధక శాఖ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, సేల్స్ ట్యాక్స్, జిల్లా పరిశ్రమల శాఖ, ఐ.ఎస్.ఐ., పంచాయతీ, నగర పంచాయతీ, మున్సిపాలిటీ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలి. కానీ ఇవేవీ పట్టకుండా ఎక్కడపడితే అక్కడ చిన్న చిన్న ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నారు. నీటి వ్యాపారంతో రూ. లక్షల్లో అర్జిస్తున్నారు. జిల్లాలో సుమారు 200 వరకూ నీటి తయారీ ప్లాంట్లు ఉన్నాయి. వీటిలో అన్ని శాఖల అనుమతులతో నిర్వహిస్తున్నవి 50కి మించి లేవు.

● ఇదో మతలబు..

నీటి ప్యాకెట్లు, వాటర్ క్యాన్ల మీద తయారు తేదీ, బ్యాచ్ నెంబర్, ఎక్స్‌పెయిరీ డేట్ వంటివేవీ కనిపించవు. ప్రధానంగా వాటర్‌క్యాన్లలో నేరుగా 20 లీటర్ల సాధారణ నీరుపోసి సరఫరా చేస్తున్నారు. క్యాన్ల పరిశుభ్రత కూడా అంతంత మాత్రమే. వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు నిబంధనలు పాటిస్తున్నారా లేదా.. అన్ని శాఖల నుంచి అనుమతులు ఉన్నాయా లేదా.. నీటి తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా వంటి అంశాలను పరిశీలించాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.



పరిశుభ్రతకు నోచుకోని వాటర్ క్యాన్లు..

● ఆ నీటితో ముప్పే..

దాహం వేస్తుందని ఎవరైనా వాటర్ ప్యాకెట్ కొని తాగితే ఇక అంతే. ప్యాకెట్‌లో నీరు నోటిలో పోయగానే ప్లాస్టిక్ వాసన గుప్పుమంటోంది. వెంటనే దగ్గు మొదలవుతోంది. నిర్ణీత గడువు ఉన్నా కొంతమంది షాపుల యజమానులు నీటి ప్యాకెట్ల బస్తాలను ఎండలో వదిలేయడంతో ఎండవేడిమికి ప్లాస్టిక్ కవర్ కరిగి నీటిలో కలుస్తోంది. ఇలాంటి నీటిని తాగడం వల్ల రోగాల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రధానంగా చిన్నారులు ఇలాంటి నీటిని తాగిన కొద్దిసేపటికే వాంతులయ్యే అవకాశాలెక్కువని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

● దగ్గు, గొంతునొప్పి..



నాణ్యత లేని నీటిని తాగడం వల్ల గొంతునొప్పి, జలుబు, దగ్గు, టాన్సిల్స్ తదితర ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. నీటి తయారీదారులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా తయారు చేయకపోతే ప్రజలు రోగాల బారిన పడతారు. సాధారణ నీటిని వేడిచేసి.. చల్లార్చి తీసుకుంటే ఆరోగ్యానికి ఎంతో మేలు. వీలు కాని సమయాల్లో ప్యాకెట్లకు బదులు బ్రాండెడ్ కంపెనీల నీటిని తీసుకుంటే మంచిది.

-డాక్టర్ పి.ఎల్.ఎన్.రాజు,
ఇ.ఎన్.టి. స్పెషలిస్ట్, రాజాం

ఘనంగా పోలమాంబ 9వ వారం జాతర

మక్కువ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్యదేవత శంబర పోలమాంబ అమ్మవారి 9వవారం జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని ఆశీస్సులు పొందారు. చదురుగుడి, వనంగుడి వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్ల గంటల తరబడి వేచి ఉండి... అమ్మవారిని దర్శించుకున్నారు. గోముఖీ నది తీరాన భక్తులు అమ్మవారికి కోళ్లు, చీరలు, మొక్కులు చెల్లించుకున్నారు. వనం గుడి వద్ద వేపచెట్టుకు కుంకుమ పూజలు చేశారు. ఎస్ఐ ఎం.వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. క్యూలైన్‌లో వేచి ఉండే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈవో వి.వి.సూర్యనారాయణ ఏర్పాట్లు చేశారు. వచ్చేవారం పోలమాంబ అమ్మవారి పదో వారం జాతర జరుగనుంది. చండీయాగం, కుంకుమ పూజలు, అన్నసంతర్పణ చేయనున్నారు.



శంబర పోలమాంబ అమ్మవారు



క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు



స్వామి వారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

వైకుంఠ నారాయణునికి పంచామృతాభిషేకం

విజయనగరం రింగురోడ్డు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రం రామనారాయణంలో మంగళవారం వైకుంఠ నారాయణునికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. దేవాలయ అర్చకులు చాణక్య ఆధ్వర్యంలో వేద మంత్రాల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత వైకుంఠ నారాయణునికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవంలో ఎన్‌సీఎస్ ట్రస్టు సభ్యులు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, పీఆర్‌ఓ రమణ, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా బురదాలమ్మ సిరిమానోత్సవం

సాలూరు రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సాలూరు మండలం దత్తివలస గ్రామదేవత బురదాలమ్మ సిరిమానోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. రెండేళ్లకు ఒకసారి నిర్వహించే బురదాలమ్మ సిరిమానోత్సవాన్ని తిలకించడానికి సాలూరు, మామిడిపల్లి పరిసర గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు వచ్చారు. సిరిమానోత్సవం ప్రారంభానికి ముందు జన్ని సీతయ్య థింసా వాయిద్యాల మధ్య గ్రామ కట్టడి చేశారు. అనంతరం అమ్మవారి ఘటాలను ఊరేగించారు. అనంతరం సంప్రదాయబద్ధంగా సిరిమానును జన్ని సీతయ్య అధిరోహించారు. ఆయనపై భక్తులు అరటిపండ్లు విసురుతూ భక్తిని చాటుకున్నారు. సిరిమానోత్సవం అనంతరం ఘటాలకు పూజలు చేశారు. అమ్మవారి భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు.



గ్రామ కట్టు కడుతున్న జన్ని సీతయ్య



సిరిమానోత్సవంలో పాల్గొన్న భక్తులు



కైలాసనాథుని వార్షికోత్సవం

గుమ్మలక్ష్మీపురం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉమాసహిత కైలాసనాథస్వామి 42వ వార్షిక మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని స్వయంగా పల్లకిలో మోసి తిరువీధి నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

← స్వామి వారి పల్లకీని మోస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

కేజీబీవీల్లో ల్యాబ్‌ల ఏర్పాటు

● రాష్ట్ర కార్యదర్శి దేవానందరెడ్డి

భోగాపురం, మార్చి25 (ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యాసంవత్సర ప్రారంభం నాటికి రాష్ట్రంలో అన్ని కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో బైసీపీ విద్యార్థులకు ల్యాబ్‌ల ఏర్పాటుకు సన్నహాలు చేస్తున్నామని కేజీబీవీ రాష్ట్ర కార్యదర్శి డి.దేవానందరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన భోగాపురంలోని కస్తూర్బా విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటర్మీడియట్ విద్యార్థులు ఎలా పరీక్షలు రాశారని, పదో తరగతి విద్యార్థులు ఎలా పరీక్షలు రాస్తున్నారని ఆరా తీశారు. 'అనంతరం 6, 7, 9 తరగతుల విద్యార్థులతో ఆయన మాట్లాడారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు ఏపీసీ రామారావు, జీసీడీవో మాలతి, ఎంఈవో బాలిపల్లి చంద్రమౌళి ఉన్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న దేవానందరెడ్డి



ఆలయ ఆవరణలో పూజలు చేస్తున్న దృశ్యం

కోటదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం

వీరఘట్టం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టంలోని కోటదుర్గమ్మ దేవాలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేశారు. ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కోటమ్మ అమ్మవారు

అంబరాన కోటమ్మతల్లి సంబరం

● ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

శృంగవరపుకోట రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఇలవేల్పు కొట్టాం కోటమ్మతల్లి జాతర అంబరాన్ని తాకింది. మంగళవారం నిర్వహించిన ఈ పండుగలో భాగంగా అమ్మవారి పూజార్లను తొలుత ఉరేగించారు. మహిళలు ఘటాలు మోసి... మొక్కులు చెల్లించుకున్నారు. రెండేళ్లకోసారి ఈ జాతర నిర్వహించడం ఆనవాయితీ. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన గ్రామస్థులంతా ఇక్కడికి వచ్చి ఉత్సవాలలో పాల్గొంటారు. జాతరలో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు... బళ్ల వేషాలు ఆకట్టుకున్నాయి. మంగళవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో గద్దెగుడిలో ఉన్న అమ్మవారిని తిరిగి వనంగుడికి తీసుకెళ్లారు. ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.



ట్రాక్టర్ నడుపుతున్న శివుడి వేషధారి



అమ్మవారి పూజారులను ఊరేగిస్తున్న దృశ్యం

చెయ్యి ఎత్తితే ప్రమాదమే..

● మండల కేంద్రానికి వెళ్లే రోడ్డులో వేలాడుతున్న విద్యుత్ తీగలు ● ఆందోళన చెందుతున్న స్థానికులు



బుదరాయివలస సమీపంలో వేలాడుతున్న తీగలు



విద్యుత్ స్తంభం, తీగలకు అల్లుకున్న పిచ్చిమొక్కలు

మెరకముడిదాం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్భాం-మెరకముడిదాం ప్రధాన రహదారిలో బుదరాయివలస సమీపంలో విద్యుత్ తీగలు చేతికి అందేంత ఎత్తులో వేలాడుతున్నాయి. దీంతో అటుగా వెళ్లేందుకు స్థానికులు భయపడుతున్నారు. చాన్నాళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా పట్టించుకునే నాథులే కరువయ్యారు. వేలాడుతున్న తీగలను సరిచేయలేని ఉద్యోగుల తీరుపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొన్ని స్తంభాలను పిచ్చిమొక్కలు అల్లుకుని ఉన్నా వారి చర్యలు శూన్యం. ఇకనైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించాల్సి ఉంది.

వెదురు కర్రలే స్తంభాలు

● ప్రమాద నివారణ చర్యలు చేపట్టిన శేషపుపేట గ్రామస్థులు

గుర్ల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శేషపుపేటలో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి, పాఠశాల ఆవరణలో, పొలాల్లో వేలాడుతున్న తీగలు భయాందోళన కలిగిస్తున్నాయి. ఈ విషయం పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలియజేసినా వారు పట్టించుకోలేదనేది స్థానికుల మాట. సంబంధిత శాఖ అధికారులు కనీస చర్యలు చేపట్టకపోవడంతో స్థానికులు తాత్కాలిక ఏర్పాట్లు చేసుకున్నారు. వెదురు కర్రలను స్తంభాల మాదిరిగా పాతి తీగలు కిందకు వేలాడకుండా రక్షణ చర్యలు చేపట్టారు.



తీగలు వేలాడకుండా కర్ర స్తంభం ఏర్పాటు

తాగునీటి సరఫరాకు అంతరాయం

విజయనగరం రింగురోడ్డు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మధుపాడ తాగునీటి పైప్‌లైన్‌లో లీక్‌ల వల్ల కలెక్టర్ కార్యాలయ ప్రాంతంలో నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడిందని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల నగరంలో 36, 38, 39, 40, 41, 20, 24 డివిజన్లలో నీటి సరఫకు అంతరాయం కలిగిందని తెలిపారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. నీటి సరఫరాకు అంతరాయం కలిగిన ప్రాంతాలకు ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేపడు తున్నామన్నారు. బుధవారం సరికి తాగునీటి సరఫరాను పునరుద్ధరించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

చిన్నశిర్లాం ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

రేగిడి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో చిన్నశిర్లాం ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ మజ్జి చిరంజీవిపై ఎంపీడీవో శ్యామలకుమారి మంగళవారం విచారణ చేపట్టారు. కొంతమందికి ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్దేశపూర్వకంగా పని కల్పించటం లేదని, విధులు సక్రమంగా నిర్వహించటం లేదని, బినామీ మస్తర్లతో అక్రమాలకు పాల్పడినట్లు అదే గ్రామానికి చెందిన మజ్జి బంగారునాయుడు, పాలూరి సూర్యనారాయణ, మజ్జి రమేశ్.. జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుపై డ్వామా పీడీ స్పందించారు. విచారణ చేపట్టాలని ఎంపీడీవోను ఆదేశించడంతో ఆమె స్థానిక సచివాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్, ఫిర్యాదుదారులు, వేతనదారులను విచారించారు. విచారణలో సర్పంచ్ ఉమాపాపినాయుడు, వైస్ ఎంపీపీ అచ్చంనాయుడు, మజ్జి శ్రీనివాసరావు, ఏపీవో హరనాథ్, ఈసీ రామినాయుడు ఉన్నారు.

యూపీ స్కూళ్లను కొనసాగించండి

మెరకముడిదాం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఫౌండేషన్ స్కూల్స్ ఏర్పాటులో భాగంగా 6, 7, 8 తరగతులను కుదించి యూపీ స్కూళ్లను రద్దు చేయడం సరికాదని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆల్తి రాంబాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు కొనసాగిస్తూ ఫౌండేషన్, ఆదర్శపాఠశాలల ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయనతో పాటు ఆర్.సింహాద్రి, ఎ.శ్రీహరి, మహేశ్, జి.అప్పలనాయుడు, జి.శ్రీదేవి, కె.త్రివేణి, వి.మోహనరావు, ఆర్.నారాయణరావు తదితరులు ఉన్నారు.

వడ్డీ రాయితీని వినియోగించుకోండి

విజయనగరం రింగురోడ్డు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఇంటిపన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిలను మార్చి 31లోగా ఏకమొత్తంలో చెల్లిస్తే, కట్టాల్సిన వడ్డీలో 50 శాతం రాయితీని ప్రభుత్వం ప్రకటించిందని నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 50 శాతం వడ్డీ రాయితీ మొత్తాన్ని వచ్చే ఆర్థిక సంవత్సరానికి చెల్లించాల్సిన పన్నులో సర్దుబాటు చేయడం జరుగుతుందన్నారు.

అభివృద్ధి ప్రణాళికలకు సర్వే దోహదం

కొత్తవలస, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి ప్రణాళికలు, విధాన నిర్ణయాలకు గణాంక సర్వే సహాయ పడుతుందని జాతీయ గణాంక సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ రాజశేఖర్ అన్నారు. నేషనల్ శాంపిల్ సర్వేను ఏర్పాటు చేసి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం ఉమ్మడి జిల్లాలకు సంబంధించి మండలంలోని కంటకాపల్లి సచివాలయంలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.నీలకంఠరావు, ఎంపీడీవో రమణయ్య పాల్గొన్నారు.

ఆశీలు వేలం పాట వాయిదా

గజపతినగరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గజపతినగరం పంచాయతీ పరిధిలో రోజువారీ ఆశీలు వేలం పాట వాయిదా పడినట్టు ఈవో జనార్దన్ తెలిపారు. ఏడాది కాలానికి రూ.2.10 లక్షలకు ప్రభుత్వ పాట నిర్ణయించామన్నారు. అయితే మంగళవారం నిర్వహించిన ఆశీలు వేలం పాటకు ఒక్కరే హాజరు కావడంతో పాటను గురువారానికి వాయిదా వేశామని తెలిపారు.

రస్తాకు సరిహద్దుల గుర్తింపు

మెరకముడిదాం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉత్తరావల్లిలో ఆక్రమణకు గురైన రస్తాకు రెవెన్యూ అధికారులు మంగళవారం సరిహద్దులు గుర్తించారు. రస్తా ఆక్రమణకు గురైన నేపథ్యంలో మాజీ సర్పంచ్ మండల సత్యనా రాయణ, కొంతమంది గ్రామస్థులు ఇటీవల మండల గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ అజురుద్దీన్ జాన్ ఆదేశాల మేరకు మండల సర్వేయర్ జి.శంకరరావు మంగళవారం ఉత్తరావల్లిలో సర్వే నిర్వహించారు. రస్తాకు సంబంధించిన సరిహద్దులను గుర్తించారు

టీడీపీ ఎప్పుడూ ప్రజల పక్షమే..



మాట్లాడుతున్న అశోక్ గజపతిరాజు

విజయనగరం రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): దేశం ఏ పార్టీకి లేని విధంగా సిద్ధాంతాలు కలిగిన ఏకైక పార్టీ టీడీపీయేనని ఆ పార్టీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు అన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల దాటిన ప్రాంతీయ పార్టీ టీడీపీ, నేడు జాతీయ పార్టీగా ఆవిర్భవించిందన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ఎప్పుడూ ప్రజల పక్షమేనన్నారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ ప్రతి రెండేళ్లకు ఒకసారి సభ్యత్వ నమోదు, క్రమం తప్పకుండా సంస్థాగత ఎన్నికలు నిర్వహించడం దేశంలో టీడీపీ ఒక్కటేనన్నారు. ఈ నెల 29న పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని అన్ని డివిజన్లు, గ్రామాల్లో నిర్వహించాలన్నారు. ఇటీవల మృతి చెందిన టీడీపీ నాయకులు మేకా కాశీవిశ్వేశ్వరుడు, సారిక వెంకట రమణల మృతి టీడీపీకి తీరని లోటని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు చెప్పారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

టీడీపీలో 70 కుటుంబాల చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అదితి

సమావేశంలో భాగంగానగరంలోని 34, 39 డివిజన్లకు చెందిన వైసీపీ నాయకులు ఇప్పిలి నాగరాజు, అమరపు శ్రీను, బి రాంబాబు, నంబూరి అప్పలరాజు, భాను మహేంద్ర, శ్రీహర్ష, రామానందంతో పాటు 70 కుటుంబాలు ఎమ్మెల్యే అదితి గజపతిరాజు సమక్షంలో టీడీపీ తీర్థం తీసుకున్నారు.

రెల్లి కులస్థులకు న్యాయం చేయండి



ధర్నాలో రెల్లి కుల సంఘం ప్రతినిధులు

విజయనగరం దాసన్నపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రెల్లి కులస్థులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని ఆ కుల సంఘం ప్రతినిధులు వై.రఘు, డి.శ్రీను డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణలో రెల్లి కులస్థులకు అన్యాయం జరిగిందని మంగళవారం నగరంలోని అంబేడ్కర్ జంక్షన్ సమీపంలో మహాధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెల్లి కులస్థులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1.30 లక్షల మంది ఉన్నారనే నివేదిక తప్పన్నారు. విజయనగరాన్ని యూనిట్‌గా తీసుకుంటే 76 వేల మంది ఉన్నారన్నారు. జనాభా పరంగా అధికంగా తాము ఉన్నప్పటికీ వర్గీకరణలో అన్యాయం చేశారన్నారు.కార్యక్రమంలో సతీష్, రమణ, వలి, దుర్గారావు పాల్గొన్నారు.

'విధి నిర్వహణలో నిర్లక్ష్యం సరికాదు'

గంట్యాడ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యం వహించడం సరికాదని ఎంపీపీ పీరుబండి హైమావతి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సోషల్ ఆడిట్ అధికారులు మాట్లడుతూ చాలా గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు సక్రమంగా విధులు నిర్వహించలేనట్టు గుర్తించామన్నారు. కొన్నిచోట్ల వేతనదారులకు మస్తర్లు వేయకపోవడం, బిల్లులు మంజూరు చేసినా తర్వాత వేతనదారులు సంతకాలు తీసుకోలేనట్టు వెల్లడైందన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకుడు జైహింద్‌కుమార్, ఏపీడీ రమామణి, ఎంపీడీవో రమణమూర్తి, ఏపీవో సుందరరావు, పీఆర్ జేఈ కొల్లి కృష్ణమూర్తి, విజిలెన్స్ అధికారి భానోజీరావు ఉన్నారు.

వంద రోజుల పని కల్పించండి

గుర్ల, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ప్రతి వేతనదారుడికీ వంద రోజుల పని కల్పించాలని డ్వామా పీడీ శారదాదేవి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 42 గ్రామ పంచాయతీల్లో జరిగిన పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. అచ్యుతాపురం, పెనుబర్తి, తాటిపూడి జమ్ము, కొండగంధ్రేడు, గూడం గ్రామాల్లో ఉపాధి పనుల్లో అవకతవకలపై ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు. అప్పట్లో వైసీపీ అధికారంలో ఉండగా తమ కార్యకర్తలకు అన్యాయం జరిగిందంటూ టీడీపీ నాయకులు కేకలు వేయడంతో అక్కడ గందరగోళం నెలకొంది. జిల్లాలో అత్యధిక పనులు గుర్ల మండలంలో జరిగాయని తెలిపారు. 1,645 పనులకుగానూ రూ.31 కోట్లు దాటి వ్యయం చేసినట్టు తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ల పనితీరు సక్రమంగా లేదని షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని అన్నారు.కార్యక్రమంలో ఏపీవో కామేశ్వరరావు, సోషల్ ఆడిట్ ఎస్ఆర్పీ లక్ష్మణరావు, ఎంపీడీవో శేషు, ఏపీడీ పద్మజ, ఉపాధి హామీ ఏపీడీ విజిలెన్స్ అధికారి శ్రీనివాసు, జెడ్పీటీసీ అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే అజెండాగా పనిచేస్తా..



ఎల్.కోట: ఎమ్మెల్యే లలితకుమారికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

కొత్తవలస, మార్చి 25(ఆంధ్రజ్యోతి): తన జీవితం అంతా ప్రజాసేవ కోసమేనని, అభివృద్ధే అజెండాగా పనిచేస్తానని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మంగళవారం కొత్తవలసలోని టీడీపీ కార్యాలయంలో విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు బొబ్బిలి అప్పారావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే లలితకుమారి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బొబ్బిలి అప్పారావు ఆర్థిక సాయంతో 100 మంది వృద్ధ మహిళలకు చీరలు, 2 వేల మందికి ఫర్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు వి.హరికుమార్ భోజనాలు సమకూర్చారు. కార్యక్రమానికి ఆమె హాజరై.. తన జన్మదిన వేడుకలు నిర్వహించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీఏ రాంప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు గొరపల్లి రాము, నాయకులు కోళ్ల వెంకటరమణ, కనకాల శివ, కొరుపోలు అప్పారావు, బంగారు రమేష్, లాలం అర్జునరావు, పీవీ రత్నాజీ పాల్గొన్నారు.

● లక్కవరపుకోట: లక్కవరపుకోటలోని నివాసంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని నాయకులు, అధికారులు ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అందరికీ కోళ్ల దంపతులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి కేబీఏ రాంప్రసాద్, కరెడ్ల ఈశ్వరరావు, చొక్కాకుల మల్లునాయుడు, కొల్లు రమణమూర్తి, జీఎస్ నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా రామ్‌మల్లిక్ జన్మదిన వేడుకలు



రామ్‌మల్లిక్‌ను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

చీపురుపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యదర్శి యువ నాయకుడు కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు పుట్టిన రోజు వేడుకలు చీపురుపల్లిలో మంగళవారం ఘనంగా జరిగాయి. పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మల్లిక్‌నాయుడు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మల్లిక్‌నాయుడును గజమాలతో సత్కరించారు. అంతకు ముందు పార్టీ నాయకులు, కార్యకర్తలో ర్యాలీ నిర్వహించారు. మూడు రోడ్ల కూడలిలో బాణాసంచా కాల్చారు. కనకమహలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో టీడీపీ నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, ముల్లు రమణ, గవిడి నాగరాజు, సారేపాక సురేష్, పైల బలరాం, బలగం వెంకటరావు, తాడ్డి సన్యాసినాయుడు, తాడ్డి చంద్ర, జనసేన నాయకులు విసినిగిరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే, రామ్‌మల్లిక్‌నాయుడు పుట్టిన రోజును పురస్కరించుకుని ముల్లు రమణ తన నివాసంలో కేక్ కట్ చేశారు. పేదలకు వంట సామగ్రి పంపిణీ చేశారు.

బధిరుల పాఠశాలలో జన్మదిన వేడుకలు

గరివిడి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గరివిడిలోని బధిరుల పాఠశాలలో మంగళవారం టీడీపీ యువ నాయకుడు కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు జన్మదిన వేడుకలు నిర్వహించుకున్నారు. పిల్లల మధ్యన కేక్‌ను కట్ చేశారు. పిల్లల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్.సురేష్ కుమార్, టి.శ్రీను, కూర్మరాజు, సత్తిరాజు, దుక్క రామకృష్ణ పాల్గొన్నారు.

నగరంలో ఇఫ్తార్ విందు



విందు ఏర్పాట్లలో అహ్మద్‌బాబు

విజయనగరం బాబామెట్ట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాబామెట్టలోని సూఫీ ఆధ్యాత్మిక సయ్యద్ ఖాదర్ ఔలియా వారి సూఫీ క్షేత్రంలో రంజాన్ని మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం 24వ రోజు ఇఫ్తార్ విందు నిర్వహించారు. బాబా ఖాదర్ దర్బార్ ధర్మకర్త ఖలీలుబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో పెదఎత్తున ఉపవాస దీక్షాపరులు పాల్గొని విందును ఆరగించారు. ఖలీలుబాబు తనయుడు మహ్మద్ అహ్మద్‌బాబు భక్తులకు ఆత్మీయతతో ఇఫ్తార్ విందును వడ్డించారు.

నర్సింగ్ విద్యార్థులకు జర్మన్ భాషపై శిక్షణ

నెల్లిమర్ల, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నర్సింగ్ విద్యార్థులకు జర్మన్ భాషలో ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు స్కిల్ సంస్థ ప్రతినిధి ఉజ్వల్ తెలిపారు. మంగళవారం మిమ్స్‌లో బీఎస్సీ నర్సింగ్, ఎంఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం విద్యార్థులకు అవకాశాలు కల్పించారు. ప్రభుత్వం సహకారంతో 8 నెలల శిక్షణ అనంతరం జర్మనీలో రూ.2.50 లక్షల నుంచి రూ.3.50 లక్షల వరకు జీతంతో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఉద్యోగాలు చేయాలనుకున్న వారికి వసతి, ఆరోగ్యబీమా, పింఛను సదుపాయాలు కల్పిస్తామని జర్మనీ దేశ ప్రతినిధి విక్టోరియా తెలిపారు. కార్యక్రమంలో మిమ్స్ డైరెక్టర్ వేణుగోపాలరావు, ప్రిన్సిపాల్ సింసీర్ బేగం, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రశాంత్‌కుమార్ ఉన్నారు.

రెవెన్యూ అధికారుల తీరుపై సభ్యుల ధ్వజం

● భూ సమస్యలు ఎందుకు పరిష్కరించడం లేదని నిలదీత ● వాడీవేడిగా వంగర మండల సమావేశం

వంగర, మార్చి25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతుల సమస్యలపై రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సభ్యులు ధ్వజమెత్తారు. మండల రెవెన్యూ కార్యాలయం చుట్టూ రైతులు తిరుగుతున్నా సమస్యలు పరిష్కారం కాలేదని మండిపడ్డారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ సురేష్ ముఖర్జీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా రెవెన్యూ శాఖపై నిర్వహించిన సమీక్షలో వైస్ ఎంపీపీ ఉమతో పాటు సర్పంచులు శ్రీను, శివరామకృష్ణ తదితరులు మాట్లాడుతూ.. రెవెన్యూ సదస్సుల్లో అందిన ఫిర్యాదుల్లో ఎన్నింటిని పరిష్కరించారో చెప్పాలని ప్రశ్నించారు. అందుకు సమావేశానికి రెవెన్యూ శాఖ నుంచి హాజరైన ఆర్ఐ రామారావు మౌనం వహించారు. దీంతో ఆయనపై ఎంపీపీ మండిపడ్డారు. మండల సమావేశానికి తహసీల్దారు ఎందుకు హాజరు కావడంలేదని సభ్యులు నిలదీశారు. అనంతరం గృహనిర్మాణ అధికారుల తీరుపైనా మండిపడ్డారు. బిల్లుల చెల్లింపుల్లో పక్షపాత ధోరణి అవలంబిస్తున్నారని ధ్వజమెత్తారు. సమావేశంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులకు సమస్యలను చెబుతున్న సర్పంచ్

రెండో అంతస్తు నుంచి జారి పడి..

● విశ్రాంత ఉపాధ్యాయుడి మృతి

బొబ్బిలి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని నాయుడు కాలనీలో గల వంగపండు రెసిడెన్సీలో మంగళవారం రెండో అంతస్తు నుంచి జారిపడి యజ్జల శ్యామ్‌సుందరరావు(82) అనే విశ్రాంత ఉపాధ్యాయుడు మృతిచెందారు. స్థానిక సీఐ కటకం సతీష్‌కుమార్ పర్యవేక్షణలో ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. శ్యామ్‌సుందరరావు గత కొద్ది కాలంగా అల్జీమర్స్ వ్యాధితో బాధపడుతున్నారు. మంగళవారం ప్రమాదవశాత్తు రెండో అంతస్తు నుంచి జారిపడ్డారు. ఈ ప్రమాదంలో ఆయన తలవెనుక, ఎడమ కాలికి బలమైన గాయాలయ్యాయి. అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహానికి స్థానిక సీహెచ్‌సీలో పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించారు. మృతుడికి భార్య ప్రేమలత, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమారుడు విజయ్‌మోహన్ ప్రభుత్వ వైద్యుడు కాగా, రెండో కుమారుడు ఇంజనీరుగా పనిచేస్తున్నారు. కేసు చేశామని ఎస్ఐ తెలిపారు.

రాజాంలో మహిళ మృతి

రాజాం రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మల్లికార్జున కాలనీ ఏడోలైన్‌లో కింతలి మురళీకృష్ణ ఇంట్లో అద్దెకు ఉంటున్న కెల్ల లక్ష్మి (44) మృతి చెందారు. మూడురోజులుగా ఇంటి తలుపులు తెరుచుకోకపోవడం, మంగళవారం ఉదయం నుంచి దుర్వాసన రావడంతో విశాఖలో ఉంటున్న మృతురాలి కుమారుడు దుర్గాప్రసాద్‌కు స్థానికులు సమాచారం అందించారు. దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు స్థానికుల సహాయంతో రాజాం పోలీసులు, రెవెన్యూ సిబ్బంది సమక్షంలో ఇంటి తలుపులు తెరిచారు. లక్ష్మి మృతి చెంది ఉండటాన్ని గుర్తించారు. మూడు రోజుల క్రితమే ఆమె మృతి చెంది ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. విజయనగరం క్లూస్ టీం ఘటనా స్థలాన్ని సందర్శించి, సాధారణ మృతిగా నిర్ధారించారు. మృతురాలి కుమారుడు దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు.

కొట్లాటలో ఆరుగురికి గాయాలు

బాడంగి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పత్తి చేలులో గొర్రెలు మేపే విషయంలో గొల్లాది, కామన్నవలస గ్రామాలకు చెందిన యాదవుల మధ్య మంగళవారం కొట్లాట చోటు చేసుకుంది. గొల్లాదిలో జరిగిన కొట్లాటలో ఆరుగురు గాయ పడారు. వీరిని 108 వాహనంలో బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ నుంచి కామన్నవలస గ్రామానికి పడాల కామేషు, పడాల అచ్చన్నలను విజయనగరం ఘోషా ఆసుపత్రికి రిఫర్ చేశారు. మిగతా నలుగురు పడాల ఆదినారాయణ, ఈశ్వరరావు, చప్ప సత్యం, పడాల సింహాచలం బాడంగి సీహెచ్‌సీ చికిత్స పొందుతున్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

● డ్రగ్ కంట్రోలర్ రజిత

విజయనగరం రింగురోడ్డు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మెడికల్ షాపుల యాజమాన్యాలు నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని అసిస్టెంట్ డైరెక్టరు, డ్రగ్ కంట్రోలర్ కె.రజిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25న మంగళవారం 'ఏమాత్రం నిఘా లేదు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. ఎక్కడైనా కాలం చెల్లిన, నాణ్యత లేని మందులు విక్రయాలు జరిగినా, అధిక ధరలకు మందు విక్రయించినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రతి మెడికల్ షాపులో ఫార్మాసిస్టు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఇకనుంచి ఎప్పటికప్పుడు ప్రైవేట్ ఆసుపత్రులకు అనుబంధంగా ఉన్న మెడికల్ షాపులు, బయట మెడికల్ షాపులను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తామన్నారు. మెడికల్ షాపుల యాజమాన్యాలు నిబంధనలు అతిక్రమిస్తే.. విజయనగరం: 7382934399, బొబ్బిలి: 7382934327 నెంబర్లకు ఫిర్యాదు చేయాలన్నారు. ఇంకా సంతృప్తి చెందకపోతే 94901 53339ను సంప్రదించవచ్చన్నారు.

బోడసింగిపేటలో దుకాణాల తొలగింపు

బొండపల్లి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడసింగిపేటలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న దుకాణాలను మంగళవారం ఉదయం అధికారులు తొలగించారు. రెవెన్యూ, పోలీసులు, విద్యుత్‌శాఖ, పంచాయతీ కార్యదర్శి, ఎన్‌హెచ్ అధికారులు సంయుక్తంగా తొలగింపు ప్రక్రియ చేపట్టారు. బోడసింగిపేట పరిధిలో కోర్టుకు వెళ్లే రోడ్డు క్లియర్ చేశారు. బాధితుల నుంచి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా గజపతినగరం సీఐ రమణతో పాటు బొండపల్లి, ఆంధ్ర, మానాపురం ఎస్ఐలు యు.మహేష్, సీతారాం బందోబస్తు ఏర్పాటు చేశారు. జీవనోపాధి కోల్పోయామని బాధితులు ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో డీటీ రాజేశ్వరరావు ఉన్నారు.

విలువలతో కూడిన విద్య అభ్యసించండి



విద్యార్థినులతో మాట్లాడుతున్న బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి

గరివిడి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు నైతిక విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు సూచించారు. పరీక్ష సమయాల్లో ఒత్తిడికి గురికావద్దన్నారు. మంగళవారం స్థానిక కేజీబీవీని ఆయన సందర్శించారు. విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ చదువుతో పాటు ఆహారం, ఆరోగ్య విషయాల్లో జాగ్రత్త వహించాలన్నారు. ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలన్నారు. వేసవి సెలవుల్లో సెల్‌ఫోన్లు, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇజ్జిరోతు ధనలక్ష్మి ఉన్నారు.

మెరుగైన సేవలు అందించండి

నెల్లిమర్ల, మార్చి 25(ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని డీఎంహెచ్‌వో ఎస్.జీవనరాణి తెలిపారు. మంగళవారం ఆమె సతివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి సాయిరాం, డాక్టర్ అనీల్‌కుమార్ ఉన్నారు.

● గరివిడి: గరివిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో జీవనరాణి మంగళవారం సందర్శించారు. పీహెచ్‌సీలో జరుగుతున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి కె.రాజ్యలక్ష్మి ఉన్నారు.

'గురుదేవ'లో ఓఎన్‌జీసీ ప్రతినిధులు

కొత్తవలస, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగళపాలెంలో గల గురుదేవ చారిటబుల్ ట్రస్టును చెన్నైకు చెందిన ఓఎన్‌జీసీప్రతినిధులు మంగళవారం సందర్శించారు. ఓఎన్‌జీసీ ఎలక్ట్రికల్ జీఎం జ్యోతి అయ్యర్, హెచ్ఆర్ మేనేజర్ ప్రియదర్శిని కె.ముత్తయ్య ట్రస్టు ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడారు. ట్రస్టులో మరిన్ని సేవాకార్యక్రమాలను ఓఎన్‌జీసీ ద్వారా ఆర్థిక సాయం చేస్తామన్నారు. ఈ ట్రస్టు ద్వారా దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీతో పాటు తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఉప్పలపాటి విజయశ్రీ క్యాన్సర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను చూశారు. గురుదేవ ట్రస్టు ద్వారా వివిధ రకాల సేవాకార్యక్రమాలను అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీశ్‌కుమార్, వైస్ చైర్మన్ వి.ఫణీంద్ర పాల్గొన్నారు.

రూ.30.16 లక్షలకు ఆశీలు పాట ఖరారు

రాజాం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక పురపాలక సంఘం పరిధిలో 2025-26 ఏడాదికి మార్కెట్‌కు మంగళవారం ఆశీలు పాట నిర్వహించినట్టు కమిషనర్ జె.రామప్పలనాయుడు తెలిపారు. వేలం పాటలో 10 మంది పాల్గొన్నారన్నారు. వంగా గోవిందరావు రూ.30.16 లక్షలకు మార్కెట్ ఆశీలు, రూ.64,500లకు కబేళా పాట దక్కించుకున్నారు. సర్కారువారి పాట రూ.29, 39,379గా నిర్ణయించామన్నారు.కౌన్సిల్ నిబంధనలకు లోబడి పాటను ఖరారు చేశామని కమిషనర్ అన్నారు.

వడగాడ్పులకు గురికానివ్వొద్దు

రాజాం మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వివిధ సంస్థలు, పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు, నిర్మాణరంగంలో పనిచేస్తున్న కార్మికులు వడగాడ్పులకు గురికాకుండా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని సహాయ కార్మికశాఖ అధికారి బి.కొండలరావు ఓ ప్రకటనలో ఆదేశించారు. కార్మికులకు ఎటువంటి ప్రమాదం జరిగి నా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 8 మందికి వైద్యఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.11 లక్షల చెక్కులను మంగళవారం స్థానిక దర్బారు హాలులో ఎమ్మెల్యే బేబీనాయన లబ్ధిదారులకు అందజేశారు. పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన రెడ్డి రాజశేఖర్‌కు రూ.4లక్షలు, జెంజేటి రాజేశ్వర్మకు రూ.81వేలు, కోమటిపల్లికి చెందిన ఆవాల చినగురువులుకు రూ.36,162, తారాపురానికి చెందిన రెల్లి మురళికి రూ.1.08లక్షలు, బాడంగి మండలం పిన్నవలసకు చెందిన పెద్దింటి తేజకు రూ.1.60 లక్షలు, కొండ కెంగువలో బండారు వాసు సాయిచైతన్యకు రూ.41,084, వీరసాగరంలో దుంబిరి విష్ణువర్ధన్‌కు రూ.2.06 లక్షలు, గొల్లపేట.. లెంక సాయికుమార్‌కు రూ.60వేల చొప్పున మంజూరయ్యాయి. వారందరికీ ఎమ్మెల్యే స్వయంగా చెక్కులను అందజేశారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజల అభిమతాన్ని గౌరవిస్తున్నాం



మాట్లాడుతున్న సుజయ్‌కృష్ణ రంగారావు

బొబ్బిలి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావుపై అవిశ్వాస తీర్మానం పెట్టే అంశంపై మాజీ మంత్రి, రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఆర్‌వీ సుజయ్ కృష్ణరంగారావు స్పష్టత ఇచ్చారు. బొబ్బిలి కోటలోని తన నివాసంలో మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ప్రజల అభిమతాన్ని గౌరవిస్తున్నాం.. బొబ్బిలి మున్సిపాలిటీ పాలకపక్షాన్ని మార్చాల్సిన తరుణం ఆసన్నమైందని స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో ఆనాడు స్థానిక సంస్థలకు ఎన్నికలు ఎలా నిర్వహించారో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. బొబ్బిలి పురపాలక సంఘం ఎన్నికల్లో కూడా టీడీపీ అభ్యర్థులను భయ పెట్టి ప్రలోభాలకు గురిచేసి వైసీపీ విజయం సాధించిందన్నారు. బొబ్బిలి మున్సిపాలిటీలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, అవినీతి పెచ్చుమీరి పోయిందన్నారు. నాలుగేళ్లుగా అసమర్థ, అవినీతి పాలన సాగిందని వైసీపీ కి చెందిన కౌన్సిలర్లే ఆరోపణలు గుప్పిస్తున్నారన్నారు. చైర్మన్ పదవికి అనర్హుడని వారే అంటున్నారని చెప్పారు. వైసీపీ కౌన్సిలర్లంతా ఇలా ముందుకు రావడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు.

షోకాజ్ నోటీసులు జారీ చేయండి

● సచివాలయ సిబ్బందిపై మున్సిపల్ కమిషనర్ ఆగ్రహం



సిబ్బంది పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని కుమ్మరివీధి, వంతరాం రోడ్డులో గల సచివాలయాలను మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో సిబ్బంది పనితీరు సక్రమంగా లేనట్టు ఆమె గుర్తించారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటలకే సచివాలయాలకు హాజరు కావాలని ఆదేశించినప్పటికీ సిబ్బంది బేఖాతరు చేశారు. వార్డులో మంచి నీటి సరఫరా జరిగిన సమయంలో పర్యవేక్షించాలని ఆదేశించినా ఎవరూ పట్టించుకోలేదు. నెలాఖరులోగా ఆర్థిక సంవత్సరం ముగుస్తుండడంతో ఆస్తి పన్ను, కుళాయి పన్నులు వసూళ్ల లక్ష్యాలను నెరవేర్చడంలో సిబ్బంది పూర్తిగా విఫలం కావడంతో కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులలో నిర్లక్ష్యం వహించి తగిన సేవలందించడంతో అలక్ష్యం ప్రదర్శించిన ఉద్యోగులందరికీ షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కమిషనర్ ఆదేశించారు.

పన్నులపై 50 శాతం వడ్డీ రాయితీ

బొబ్బిలి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో ఇంటిపన్ను, ఖాళీ స్థలాల పన్నులపై 50 శాతం వడ్డీ రాయితీని ప్రభుత్వం ప్రకటించినట్టు కమిషనర్ లాలం రామలక్ష్మి తెలిపారు. మంగళవారం సాయంత్రం బొబ్బిలిలోని తన కార్యాలయంలో అధికారులు, సిబ్బందికి ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వడ్డీ రాయితీని ప్రభుత్వం కల్పించినందున బకాయిదారులందరికీ ఈ విషయమై అవగాహన కల్పించి పన్నుల వసూళ్లను ముమ్మరం చేయాలన్నారు. ఇప్పటికే పన్నుల బకాయిలను చెల్లించినవారికి కూడా ఈ వడ్డీ రాయితీ వర్తిస్తుందన్నారు. చెల్లించిన పన్ను మొత్తంలో రాయితీగా వచ్చిన వడ్డీ 50 శాతం మొత్తాన్ని రాబోయే ఆర్థిక సంవత్సరానికి వర్తించే విధంగా జమ చేస్తారని ఆమె తెలిపారు. అధికారులు, సిబ్బంది వార్డుల్లోనికి వెళ్లి పన్ను బకాయిదారులందరికీ ఈ సమాచారం తెలియజేయాలని అన్నారు.

పాతబొబ్బిలి సమస్యలను పరిష్కరించండి

● ఎమ్మెల్యే బేబీనాయనకు మొర పెట్టుకున్న మహిళలు

బొబ్బిలి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని పాత బొబ్బిలి గ్రామంలో 1, 2 వార్డులలో అనేక సమస్యలు పేరుకుపోయాయని, ఎన్ని సార్లు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆ గ్రామస్థులు మంగళవారం స్థానిక ఎమ్మెల్యే బేబీనాయన ముందు మొరపెట్టుకున్నారు. దిబ్బవీధి, ముద్దానవీధి, పల్లెం వీధులలో అనేక సమస్యలతో సతమతమవుతున్నామని, మురుగు కాలువల్లోని నీరంతా తమ ఇళ్లల్లోనికి చేరుతోందన్నారు. దీంతో దోమలు, ఈగలతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. కాలువల నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యేని కోరడంతో ఆయన వెంటనే స్పందించి మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడారు. తక్షణం ఈ సమస్యలన్నిటినీ పరిష్కరించాలని ఆదేశించారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా వెంకటరమణ

బొబ్బిలి , మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బొబ్బిలి మండల అధ్యక్షుడిగా అల్లు వెంకటరమణ నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ పెద్దలు, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం దిబ్బగుడ్డివలస గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మువ్వల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ ఉత్తర్వులను పార్టీ జిల్లా అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్ చేతులమీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో దత్తి కృష్ణ, పాల గంగయ్య, పి.దాసు, చిన్నయ్య, మండపాక శ్రీనివాసరావు, రాయి రామారావు పాల్గొన్నారు.

నేడు మాజీ సైనికుల సమస్యల పరిష్కార వేదిక

బొబ్బిలి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పరిసర ప్రాంతాల మాజీ సైనికుల సమస్యల పరిష్కార వేదికను బుధవారం బొబ్బిలి పాతకోటలోని సంఘం కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా సైనిక సంక్షేమ అధికారి మజ్జి కృష్ణారావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సంఘం గౌరవ అధ్యక్షుడు ఎం.రామినాయుడు ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ వేదికలో మాజీ సైనికుల సమస్యలను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

ఆయుధ డిపో వద్దు

బొబ్బిలి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): బాడంగి పాత విమానాశ్రయ ప్రాంతంలో నేవీ ఆయుధ డిపో ఏర్పాటు ప్రతిపాదనను విరమించుకోవాలని సీపీఐ నాయకులు అలమండ ఆనందరావు, కోట అప్పన్నలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. సుమారు 1,800 ఎకరాలలో ఆయుధ డిపో ఏర్పాటు నిమిత్తం పాల్తేరు, పిన్నవలస, రామచంద్రపురం, ముగడ, పూడివలస, కోడూరు, మల్లమ్మపేట గ్రామాలకు చెందిన భూములను తీసుకునేందుకు ప్రతిపాదిస్తున్నారని తెలిపారు. ఈ సారవంతమైన భూములను ఆయుధ డిపో కోసం తీసుకుంటే రైతులు ఎలా జీవనం సాగిస్తారని వారు ప్రశ్నించారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు.

ఉగాదికి ముందే తలుపుతట్టిన అదృష్టం

(ఐదో పేజీ తరువాయి)

ఫోన్ చేసి మోటారు బైక్ గెలుచుకున్నట్టు చెప్పడంతో ఆయన ఉబ్బితబ్బిబ్బఅయ్యారు. ద్వితీయ బహుమతి గెలుచుకున్న లంక కుమారితో అడిషనల్ ఎస్పీ ఫోన్‌లో మాట్లాడారు. రిఫ్రిజిరేటర్ గెలుచుకున్నట్టు చెప్పడంతో ఆమె సంతోషానికి అవధుల్లేవు. తృతీయ బహుమతి పొందిన పేడాడ లలితకుమారితో ఎచ్చెర్ల ఎస్‌ఐ వి.సందీప్‌కుమార్ ఫోన్‌లో మాట్లాడి మీకు కలర్ టీవీ వచ్చిందని చెప్పడంతో ఆమె సంతోషాన్ని వ్యక్తంచేసింది. వీరితో పాటు మరో 100 మందికి కన్సొలేషన్ బహుమతులను ప్రకటించారు. కార్య క్రమంలో 'ఆంధ్రజ్యోతి' బ్రాంచ్ మేనేజర్ ఆర్.సోమశంకర రావు, ఎడిషన్ ఇన్‌చార్జి పి.బయపరెడ్డి, స్టాఫ్ రిపోర్టర్ టి.సురేష్‌బాబు, డీసీఎం పి.అనంతకుమార్, ఏబీఎన్ స్టాఫ ర్ బి.రమేష్, సర్క్యులేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

చాలా ఆనందంగా ఉంది..



చాలా ఆనందంగా వుంది. ఐదేళ్లుగా ఆంధ్రజ్యోతి పేపర్ చదువుతున్నాను. ఏడాది సబ్‌స్క్రిప్షన్ తీసుకుంటున్నాను. ఆంధ్రజ్యోతి కథనాలు ఆకట్టుకుంటాయి. ఇటీవల కాలంలో పరిశోధనాత్మక కథనాలతో పాటు అన్యాయాలు, అక్రమాలపై బాగా స్టోరీలు వస్తున్నాయి. ఆదివారం ప్రత్యేక సంచిక చాలా బావుంటుంది. భవిష్యత్తులో కూడా మరిన్ని మంచి కథనాలు రావాలి. ఆంధ్రజ్యోతి దినపత్రిక అభిమానిగా తాను గతంలో కూడా కార్‌రేస్, బైక్‌రేస్ లక్కీ డ్రాలో పాల్గొన్నాను. ఈ ఏడాది తొలి బహుమతి లభించింది.

- బి.రామకృష్ణ, ప్రథమ బహుమతి విజేత, విజయనగరం

పాఠకులను ప్రోత్సహించే కార్యక్రమం..



పాఠకులను ప్రోత్సహించేందుకు 'ఆంధ్రజ్యోతి' ఇలాంటి డ్రాలు నిర్వహించడం అభినందనీయం. ఈ పత్రిక సామాజిక బాధ్యతను నిర్వహిస్తూనే, పాఠకులను ఉత్సాహపరిచేలా కార్ అండ్ బైక్ రేస్ లక్కీ డ్రాలను నిర్వహించడం హర్షణీయం. పాఠకులకు గుర్తింపుగా బహుమతులు అందజేయడం శ్లాఘనీయం. ఇలాంటి కార్యక్రమాలతో పత్రికకు మరింత ఆదరణ పెరుగుతుంది. అదృష్టం కొద్దిమందినే వరించినా, వేలాది మంది పాఠకులు డ్రాలో పాల్గొనడం విశేషం. మూడు జిల్లాల నుంచి వేలాది మంది కూపన్లను పంపించారంటే చాలా మంది పాఠకులు ఈ కాన్సెప్ట్ పట్ల ఆసక్తి చూపుతున్నట్టు అర్థమవుతుంది. ఎంత ఎక్కువ మంది పాఠకులు ఈ డ్రాలో పాల్గొంటే అంత స్థాయిలో పత్రికపై ఉన్న అభిమానానికి తార్కాణం.

- కె.వెంకటరమణ, అడిషనల్ ఎస్పీ, శ్రీకాకుళం

ఇదో మంచి కార్యక్రమం..



ఇదో మంచి కార్యక్రమం. నిత్యం సమస్యలపై స్పందిస్తూ, వినూత్న కథనాలు ఇస్తూ నిత్య నూతనంగా ఉంటున్న 'ఆంధ్రజ్యోతి' తన పాఠకులను ఆదరించేలా కారు అండ్ బైక్ రేస్ లక్కీ డ్రా నిర్వహిం చడం విశేషం. పాఠకులకు బహుమతులు అందజేయడం తో వారిని మరింత ప్రోత్సహిస్తుంది. ఇలాంటి కార్యక్రమా లతో పాఠకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

-సీహెచ్.వివేకానంద, శ్రీకాకుళం డీఎస్పీ

రెండు దశాబ్దాలుగా 'ఆంధ్రజ్యోతి' చదువుతున్నాం..



నేను రెండు దశాబ్దాల నుంచి 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక చందాదారుని. ప్రతిరోజూ క్రమం తప్పకుండా పేపరు చదువుతా. మహిళల విజయాలకు సంబంధించిన వార్తలు నాలో స్ఫూర్తిని రగిలిస్తుంటాయి. గతంలో కూడా నాకు రెండుసార్లు కుక్కర్లు, సిల్వర్ కాయిన్లు బహుమతులుగా వచ్చాయి. ఇప్పుడు రెండో బహుమతి కింద ఫ్రిజ్ గెలుచుకున్నామని శ్రీకాకుళం ఆంధ్రజ్యోతి కార్యాలయం నుంచి ఫోన్ రాగానే ఎంతో సంతోషించా. నేను అంగన్వాడీ కార్యకర్తగా పనిచేస్తున్నాను. నా భర్త శ్రీనివాసరావు గ్యాస్ కంపెనీలో పనిచేస్తున్నారు. ఆయనకు 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక అంటే చాలా ఇష్టం.

- లంక కుమారి, ద్వితీయ బహుమతి విజేత, బొబ్బిలి

చాలా సంతోషంగా ఉంది..



నాకు తృతీయ బహుమతిగా కలర్ టీవీ రావడం చాలా సంతోషంగా ఉంది. పాఠకులను ప్రోత్సహించేలా లక్కీ డ్రా నిర్వహించడం, బహుమతులు అందజేయడం నిజంగా ఆనందమే. 'ఆంధ్రజ్యోతి' పాఠకురాలిగా ఎంతో గర్వపడుతున్నా. భవిష్యత్‌లో ఈ సంస్థ మరింత అభివృద్ధి చెంది, మాలాంటి పాఠకులకు మరింత ప్రోత్సహించేలా కార్యక్రమాలను రూపొందించాలి.

-పేడాడ లలితకుమారి, తృతీయ బహుమతి విజేత, చీమలవలస, ఆమదాలవలస

కన్సొలేషన్ బహుమతి విజేతల వివరాలు

1. బీఎచ్.ఉదయ భాస్కర్, శ్రీనివాసనగర్, సాలూరు
2. సూర ప్రకాశరావు, 4 రోడ్ల జంక్షన్, కింతలి గ్రామం
3. ఈ.ఎస్ సుధాకర్ మంగళివీధి, గాజులరేగ, విజయనగరం
4. కొండదాసుల నీలకాంత్, కార్జివీధి, ఇచ్ఛాపురం,శ్రీకాకుళం,
5. ఎం.రమేష్ (ప్లాట్‌నెం 409. సాయివిహార్), పీఎన్ కాలనీ శ్రీకాకుళం
6. కూరాడ సత్యనారాయణ, వత్రివీధి, బొబ్బిలి
7. ధర్మాన రాజు వైఫ్ఆఫ్ సుబ్బారావు, నామాకాలనీ, నౌపడ
8. టి.సోమశేఖర్, చిన్నబడాం, పలాస
9. మట్టా అమ్మాజి, మహలక్ష్మినగర్, కొత్త దుప్పాడ, విజయనగరం
10. నౌదాసరి గోవిందరావు, ప్లాట్ నెం.137, నర్సిపురం, పార్వతీపురం
11. జి.కొండరాజు,అయ్యకోనేరు గట్టు, విజయనగరం
12. ఎస్.భాస్కర్‌రావు, ప్లాట్‌నెం-6, సత్యసాయిబజన మండలి, బొందిలీపురం, శ్రీకాకుళం
13. డొల్లు సత్యంనాయుడు, నాయుడు వీధి, పార్వతీపురం
14. ఇహిత పాణిగ్రహి, పెద్ది బృందావన కాలనీ, కంచిలి
15. కుషాల్ వెంకట సాయి, ఆంజనేయపురం, చీపురుపల్లి
16. టి.జయప్రసాద్,చిన్ననీలావతి, పలాస
17. సాయి మహిమాన్విత, కోవెల వీధి, అరసవల్లి
18. ఈపు విజయకుమార్, గురజాడ స్కూల్ దగ్గర, విజయనగరం
19. గోపుశెట్టి సత్యనారాయణ, సాయినగర్‌కాలనీ, పార్వతీపురం
20. భైరి శ్రీనివాసరావు, రచ్చబండ వీధి, భైరవానిపేట, శ్రీకాకుళం
21. కానపాత్రుని అప్పారావు, రావివలస, గరుగుబిల్లి మండలం
22. ఎస్.కూర్మనాథరావు, చిన్నవీధి, కనుగులవలస, ఆమదాలవలస
23. దుప్పల హేమాచలం, గాంధీనగర్, పలాస
24. చిట్టి లక్ష్మణరావు, రామ మందిరం, శిలగాం సింగువలస
25. ద్వారపు రెడ్డి జ్యోతి, బైపాస్ కాలనీ, పార్వతీపురం
26. షేక్ సిరాజుద్దిన్, మస్తాన్ వీధి, విజయనగరం
27. పెంట భాస్కరరావు పెద్దవీధి, కామన్నవలస, బాడంగి
28. బోయిన భాస్కరరావు, నియర్ బస్టాండ్, నరసన్నపేట
29. గుడ్ల ధనలక్ష్మి, మెయిన్‌రోడ్ బోరుభద్ర
30. కుప్పిలి దుర్యోధన, గైనాటి వీధి, శ్రీకాకుళం
31. కాద్రాగుల సుజాత, కంచరవీధి పార్వతీపురం
32. బి.బిందుభారతి, గోదావరి వీధి, విజయనగరం
33. సనపల లక్ష్మీగోపాల్, చిన్నవీధి, చీమలవలస, ఆమదాలవలస
34. రత్నాల ఈశ్వరరావు, ఏపీహెచ్‌బీ కాలనీ, శ్రీకాకుళం
35. బోయిన శ్రీనివాసరావు, ఆదివారంపేట, నరసన్నపేట
36. వెంకుమహంతి కళ్యాణి, కరణాలవీధి, జలుమూరు
37. గుగ్గిలపు నరసింగురావు, గుగ్గిలపు వీధి, మరడాం
38. పతివాడ నందీశ్వరరావు, బండివీధి, నరసన్నపేట
39. భైరి శ్రీనివాసరావు, భైరివానిపేట, శ్రీకాకుళం
40. యాలూరు రామలక్ష్మి, గార వీధి, ఇలిసిపురం, శ్రీకాకుళం
41. కుప్పిల నీరజ, ఎం.ఐ.జీ -286, జిల్లాపరిషత్ డౌన్ కాలనీ, శ్రీకాకుళం
42. తాళభద్ర సంతోష్, చింతాడ వీధి, నందిగాం
43. బూరెల్లి కోదండరావు, పిడిమందస, మందస
44. బెహరా ఉమామహేశ్వరరావు, కొత్తవీధి, రాయగడరోడ్, పార్వతీపురం
45. బీవీ రమణ, రాజీవ్‌కాలనీ, విజయనగరం
46. జె.బువిజ సారిక, బ్రాహ్మణవీధి, సత్యవరం, నరసన్నపేట
47. సంపతిరావు యువరాజు, పెద్దవీధి, లింగాలవలస, టెక్కలి
48. కె.అర్చన మెయిన్ వీధి, కొమరాడ
49. నెయ్యల ప్రదీప్‌కుమార్, మొండింకల్, పార్వతీపురం
50. పెద్దిపాటి లక్ష్మీనారాయణ, హరిజన వీధి, బూరగాం
51. కె.రాజేశ్వరి, మెయిన్ వీధి, శ్రీకాకుళం
52. నక్క లక్ష్మణరావు, నక్కవీధి, చినకొంగరాం, ఎచ్చెర్ల
53. కాకర్ల సూర్యరావు, లచ్చయ్యపేట, రాజాం
54. బి.భాస్కరరావు, వెలమవీధి, శ్రీకూర్మం
55. ఎం.నిహంత సాయి, నక్కలపేట పాలకొండ
56. దేంతంశెట్టి ఝాన్సీలక్ష్మి, తారకరామ కాలనీ, కణపాక, విజయనగరం
57. పల్లా పారినాయుడు, వీరఘట్టంరోడ్, నియర్ ఫైర్‌స్టేషన్, పాలకొండ
58. ఎస్.నారాయణమూర్తి, రోటరీనగర్, టెక్కలి
59. బెలగాం గణేశ్వరరావు, పద్మావతినగర్ లైన్, విజయనగరం
60. బోకర నారాయణరావు, ఎన్టీఆర్ నగర్, టెక్కలి
61. తప్పిటి అప్పడు, రిటైర్డ్‌టీచర్, బంగారమ్మకాలనీ, సాలూరు
62. కెల్ల రాజారావు, ఎస్సీ కాలనీ, కెల్ల గ్రామం, గుర్ల
63. పానుగంటి శివసిద్ధి రాజరాజేశ్వరి, బాబామెట్ట, విజయనగరం
64. భాగవతుల జగన్నాథరావు, కస్పావీధి, చీపురుపల్లి
65. బోనెల రాములు, ఇందిరానగర్ కాలనీ, శ్రీకాకుళం
66. పాత్రుని ప్రమీల, సాయిరాం కాలనీ, కొత్తవలస, పార్వతీపురం మన్యం
67. కేవీఎస్ఎస్ భక్తవత్సలరావు, న్యూకాలనీ, శ్రీకాకుళం
68. తాడ్డి శంకరరావు, కొత్తవీధి, పార్వతీపురం
69. పుల్లెల వెంకటరమణ, మంగళవారంపేట, ఇచ్ఛాపురం
70. మేదరమెట్ల శ్రీకాంత్, గరికిపాలెం కాలనీ, రణస్థలం
71. పంచదార్ల శ్రీనివాసరావు, గొల్లవీధి, గాజులరేగ, విజయనగరం
72. మాచర్ల సూర్యనారాయణ, పెద్దవీధి, విక్రమపురం, వీరఘట్టం
73. ఆకెల్ల రామకృష్ణారావు, కొత్తవీధి, దాసన్నపేట, విజయనగరం
74. తంగుడు భారతి, సీతారాంనగర్, పలాస
75. మల్లా సురేంద్ర, మెయిన్ వీధి, బూరవెల్లి,
76. వైకుంఠం తులసి, బారకాసు వీధి, సాలూరు
77. జామి ప్రసాదరావు, ఫేజ్-3, ఉడాకాలనీ, విజయనగరం
78. పి.కావ్యశ్రీ, మెయిన్‌రోడ్, అప్పలరాజు హైస్కూల్ ఎదురుగా, రాగోలు
79. దాసరెడ్డి మౌళిశ్వరరావు, బూర్జ
80. బి.రమాకుమారి, నీలంపేట, పాలకొండ
81. గేదెల లక్ష్మి, మెయిన్‌వీధి, లైదాం పొందూరు
82. నటుకుల వెంకటేశ్వరరావు, పేర్లవారివీధి, శ్రీకాకుళం
83. ఐ.లక్ష్మణరావు, పల్లివీధి, కాశీబుగ్గ
84. గొట్టాపు ఆదినారాయణ, దాడితల్లి కాలనీ, బొబ్బిలి
85. బెహరా ఉమామహేశ్వరరావు, కొత్తవీధి, పార్వతీపురం
86. జె.నాగమణి, శివాజీనగర్, పలాస
87. గున్న ధనంజయలు, బాలిగాం, మందస
88. కె.శ్రీనివాసరావు, కమ్మవీధి, విజయనగరం
89. ఎన్.నాగమణి, శివాలయం వీధి, బొబ్బిలి
90. మొదలవలస రమేష్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఆమదాలవలస
91. వి.శ్రీనివాసరావు, దాసన్నపేట, ఇచ్ఛాపురం
92. కె.రేణుకాదేవి, జీఆర్‌వలస, కొమరాడ
93. లింగం అన్నాజీరావు, బెల్లుపడ కాలనీ, ఇచ్ఛాపురం
94. ఇప్పిలి హరిప్రసాద్, సత్యసాయి మందిరం వీధి, పాతపట్నం
95. పి.పూజితాకృష్ణ, కొత్తఅగ్రహారం, విజయనగరం
96. దుమ్మా వల్లభరావు, పెద్దమ్మవారివీధి, మంచినీళ్లపేట
97. చెరువు శ్రీరామమూర్తి, ఏపీహెచ్‌బీ కాలనీ ఓల్డ్, శ్రీకాకుళం
98. జినగాల దేవేందర్, విజయదుర్గానగర్, సోంపేట
99. పి.హేమలత, రాగోలు
100. మామిడి యక్షితవర్మ, శతపతి వీధి, సాలూరు

విద్యాలయ భూములనూ వదలరా?

(5వ పేజీ తరువాయి)

సదుపాయం లేకపోవడం, ప్రైవేటు కళాశాలల ఆవిర్భావంతో ఈ కళాశాల ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొంది. అయినా కూడా విద్యార్థుల సంఖ్యను పెంచుకుంటూ వస్తోంది.

విద్యార్థినుల అవస్థలు తప్పించేందుకే..

జిల్లా విద్యార్థులతో పాటు అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖ జిల్లాలకు చెందిన విద్యార్థులూ ఇక్కడ చేరుతున్నారు. ప్రభుత్వ వసతిగృహాల్లో చేరే అవకాశం లేని దూర ప్రాంతాల విద్యార్థులు నిత్యం రాకపోకలు సాగించడానికి ఇబ్బంది పడుతున్నారు. ఆర్థిక పరిస్థితులు సహకరించక సతమతమవుతున్నారు. వీరిలో మహిళా విద్యార్థులు ఎక్కువ. దీన్ని గ్రహించిన కళాశాల యాజమాన్యం అనుబంధ వసతి గృహం కోసం ప్రయత్నించారు. ప్రభుత్వం కరుణించింది. మాన్సాస్ నుంచి కొనుగోలు చేసిన సర్వే నెంబర్ 149లోని ఐదు ఎకరాల్లో ఈ వసతి గృహ నిర్మాణం చేపట్టేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా ఖాళీ స్థలంలో ఉన్న టేకు చెట్లను తొలగించేందుకు అనుమతుల కోసం రెవెన్యూ, అటవీశాఖ అధికారులకు దరఖాస్తు చేశారు. చెట్లను తొలగిస్తున్నట్లు తెలుసుకున్న కొందరు ఈ భూములు తమవంటూ వచ్చారు. రెవెన్యూ అధికారులు సర్వే చేయడంతో ఈ భూమంతా మాన్సస్ వద్ద ప్రభుత్వ డిగ్రీ కళశాలకు కొనుగోలు చేసిందేనని తేలడంతో ప్రస్తుతానికి వెనక్కి తగ్గారు.

పక్కా రికార్డులు లేకే..

మరో సర్వే నెంబర్ 157లోని పది ఎకరాల్లో ఐదు ఎకరాల్లోపు కళాశాల భవనాలు ఉన్నాయి. మిగిలిన భూమి చాలా వరకు ఆక్రమణల్లో ఉంది. భూమిని ప్రభుత్వం కొనుగోలు చేసిన సమయంలోనే భవనాలు నిర్మించగా ఖాళీగా వున్న స్థలంలో టేకు చెట్లను నాటారు. అవి ఏపుగా పెరిగాయి. ఇప్పటికే ఈ చెట్లలో చాలా వరకు తస్కరించుకుపోయారు. కాగా కళాశాలకు భూమిని అప్పగించిన సమయంలో మాన్సాస్ నుంచి కొనుగోలు చేసినట్లు దేవదాయ శాఖ ఇచ్చిన పత్రం మాత్రమే ఉంది. మరేటువంటి రికార్డులను కళాశాలకు అప్పట్లో ఇవ్వకపోవడం అక్రమార్కులకు కలిసొచ్చింది. కళాశాలకు విక్రయించగా మరో ఐదు ఎకరాల భూమి మాన్సాస్ వద్ద ఉంది. ఆ భూమిని కూడా ఆక్రమించారు. ఇప్పటికైన కళాశాలకు విక్రయించిన భూమికి సరైన రికార్డులు, మిగులు భూముల రక్షణకు మాన్సాస్ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి

● ఆర్డీవో రామ్మోహనరావు

బాడంగి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఓటరు కార్డుకు తప్పనిసరిగా ఆధార్ నెంబరు అనుసంధానం చేయాలని ఆర్డీవో రామ్మోహన్‌రావు అన్నారు. బాడంగి తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆయన బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. బీఎల్వోలు ఓటర్ల ఐడీకార్డులకు ఆధార్ నెంబరు అనుసంధానం చేయాలన్నారు. ఓటరు జాబితాలో ఏ తప్పులు లేకుండా చూసుకోవాలన్నారు. బొబ్బిలి నియోజకవర్గ ఎన్నికల ఉప తహసీల్దార్ గౌరీశంకర్, తహసీల్దార్ సుధాకర్, డీటీ ధనం, బీఎల్వోలు పాల్గొన్నారు.

రీసర్వేకు సహకరించాలి



ర్యాలీలో పాల్గొన్న ఆర్డీవో

బాడంగి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రీ సర్వేకు రైతులు సహకరించాలని ఆర్డీవో రామ్మోహన్‌రావు కోరారు. వాడాడ గ్రామంలో మంగళవారం నిర్వహించిన రీసర్వే అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం జరిగిన గ్రామ సభలో మాట్లాడారు. వాడాడ గ్రామంలో 2,900 ఎకరాల భూములకు రీసర్వే చేస్తున్నారని, రైతులంతా సహరించాలని ఆయన కోరారు. తహసీల్దార్ సుధాకర్, రీసర్వే డీటీ అప్పలనాయుడు, ఎంపీటీసీ, సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

బొబ్బిలి , మార్చి 25 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని బొబ్బిలి ఎస్ఐ రమేష్ అన్నారు. మంగళవారం జగన్నాథపురం గ్రామంలో ఆయన గంజాయి నిర్మూలన, బెట్టింగ్ యాప్‌లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువత పట్ల తల్లిదండ్రులు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. సర్పంచ్ బొద్దల పద్మ, ఎంపీటీసీ సభ్యుడు రౌతు తిరుపతిరావు, పంచాయతీ కార్యదర్శి ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

బొబ్బిలి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో ఆస్తిపన్నును ఏప్రిల్ నుంచి పెంచాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం నాయకులు పి.శంకరరావు, సురేష్, ఎస్.గోపాలం డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఏప్రిల్ నుంచి 15 శాతం ఆస్తి పన్ను పెంచాలన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మద్యం సీసాలతో మహిళ అరెస్టు

బాడంగి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం సీసాలు తరలిస్తున్న తేలు సత్యవతి అనే మహిళను లక్ష్మీపురం గ్రామానికి వెళ్లే దారిలో పట్టుకున్నామని హెచ్‌సీ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఆమె వద్ద నుంచి 50 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని ఆయన చెప్పారు.